## 140 కిలోల నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

- ఒకరి పరారీ

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలంలోని సూర్జాపూర్ గ్రామంలో ఆదివారం ఉదయం కన్నెపల్లి వ్యవసాయాధికారి సాయిప్రశాంత్, ఎస్సై గంగారాం, పోలీస్ సిబ్బంది పక్కా సమాచారంతో బేరి నారాయణ అనే వ్యక్తి ఇంట్లో తనిఖీలు చేసి నిల్వ ఉంచిన 140 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను కన్నెపల్లి పోలీస్ స్టేషన్ లో తాండూర్ సీఐ కుమారస్వామి వెల్లడించారు. నకిలీ విత్తనాలను కలిగి ఉన్న బేర నారాయణ వెంకటాపూర్ గ్రామానికి చెందిన కొండ గొర్ల రాజన్న, సురేష్ అనే వ్యక్తుల నుండి నకిలీ పత్తి విత్తనాలను పొందినట్లు సీఐ వెల్లడించారు. ప్రస్తుతం పట్టుబడ్డ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని నిందితులైన బేర నారాయణ, కొండ గొర్ల రాజన్న లను అరెస్టు చేసినట్లు చెప్పారు. సురేష్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు సీఐ కుమారస్వామి వెల్లడించారు. నకిలీ పత్తి విత్తనాలు అమ్మిన, కొనుగోలు చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఎమ్మెల్యే వినోద్ వైఖరి స్పష్టం చేయాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**




మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి శాంతిఖని గని లాంగ్ వాల్ ప్రాజెక్టు విస్తరణపై నిర్వాసిత రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాజెక్టు విస్తరణకు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రైతులు ఎమ్మెల్యే గడ్డం వినోద్ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన రైతులు, ఎమ్మెల్యే వినోద్ రైతుల తరఫున ఎందుకు పోరాటం చేయడం లేదని ప్రశ్నించారు. గెలిచిన తర్వాత ప్రజలకు అందుబాటులో ఉంటానని ఇచ్చిన మాటను ఆయన మర్చిపోయారని ఆరోపించారు. బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను వినిపించేందుకు ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడం బాధాకరమన్నారు.

**లాంగ్ వాల్ ప్రాజెక్టుకు రైతుల విపరీతమైన వ్యతిరేకత..**

ఈ ప్రాజెక్టు విస్తరణ వల్ల 16 వందల ఎకరాల్లోని రైతులు నిర్వాసితులుగా మారే పరిస్థితి ఏర్పడిందని వారు తెలిపారు. అయినప్పటికీ, ఎమ్మెల్యే మౌనం వహించడం అర్థం కావడం లేదని మండిపడ్డారు. ప్రాజెక్టు రద్దు చేసేందుకు సింగరేణిపై ఒత్తిడి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రైతులపై పోలీసుల నిర్బంధం.. ప్రజాభిప్రాయ సేకరణలో అణచివేత..**

ప్రాజెక్టు విస్తరణపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో రైతులు తమ సమస్యలను వివరించేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అణచివేశారని ఆరోపించారు. ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక ధోరణి అని విమర్శించారు.

**ఎమ్మెల్యే రైతుల కోసం నిలబడాలని డిమాండ్..**

ప్రస్తుత పరిస్థితుల్లో ఎమ్మెల్యే గడ్డం వినోద్ తక్షణమే రైతుల తరఫున నిలబడాలని నిర్వాసితులు కోరుతున్నారు. లాంగ్ వాల్ ప్రాజెక్టును అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, రైతుల పోరాటానికి మద్దతుగా నిలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో నిర్వాసిత రైతులు గోమాస శ్రీనివాస్, చదువుల వెంకటరమణ, గోమాస వినోద్, దుర్గం జయరాజ్, దుర్గం హరికృష్ణ, గోమాస మణిదీప్, రామటెంకి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


## రేపటి తరం కోసం.. నేటి తరం




**శెనార్తి మీడియా, కర్మన్ ఘాట్ :**

చైతన్యపురిలోని తపస్య కామర్స్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో కర్మన్ ఘాట్ ప్రభుత్వ పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా తపస్య యాజమాన్యం మాట్లాడుతూ.. చదువుతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. పదో తరగతి అనేది భవిష్యత్తులో పై చదువులు చదవడానికి మొదటి మెట్టని అన్నారు. విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా ఇష్టంతో చదివి మంచి ఫలితాలు సాధించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు త్రివేణి, అధ్యాపక బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన చెరుకు శ్రీనివాసరెడ్డి



**శెనార్తి మీడియా, దౌల్తాబాద్ :**

మండలంలోని సూరంపల్లి మాజీ సర్పంచ్ అయ్యగారి నర్సింలు కూతురు వివాహం ఆదివారం జరిగింది. కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు పడాల రాములు, సీనియర్ నాయకుడు కర్నాల శ్రీనివాస్ రావు, మండల ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బందారు లాలు, టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి గణేష్ పంచమి,మండల ప్రధాన కార్యదర్శి జనగామ మల్లారెడ్డి,యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సిందం శశికాంత్,సూరంపల్లి గ్రామ అధ్యక్షుడు నర్సింలు తదితరులు హాజరై ఆశీర్వదించారు.

# భర్త చేసిన ప్రయత్నం.. అనుకోకుండా భార్య మృతి

**కామారెడ్డి, మార్చి 9 :**

పెట్రోల్ దొంగతనాన్ని అరికట్టడానికి చేసిన ప్రయత్నం తన భార్య ప్రాణాలనే బలితీసుకుంటుందని ఊహించని భర్త. భర్త చేసిన పనికి ఆ భార్య ప్రాణాలు కోల్పోయిన విషాద సంఘటన కామారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ మండలం సీతారాంపల్లి గ్రామానికి చెందిన రాజనర్సు టీవీఎస్ ఎక్సెల్ వాహనం నుంచి కొద్ది రోజులుగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి పూట పెట్రోల్ దొంగిలిస్తున్నారు. విషయాన్ని గమనించిన రాజనర్సు పెట్రోల్ దొంగలించకుండ ఉండేందుకు శనివారం రాత్రి తన వాహనానికి కరెంటు షాక్ పెట్టి ఇంటి పక్కనే గల రేకుల షెడ్డులో పార్కింగ్ చేసాడు. అది గమనించని అతని భార్య రాధిక అదే షెడ్డులో వంట చేస్తుండగా టీవీఎస్ వాహనాన్ని తాకింది. దీంతో ఆమెకు కరెంటు షాక్ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే రాధిక మృతి చెందినట్లుగా డాక్టర్లు నిర్ధారించారు. రాధిక మృతి ఆ కుటుంబంతో పాటు, గ్రామంలో విషాద ఛాయలు అలుముకునేలా చేశాయి. భర్త రాజనర్సు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## స్వేరోస్ సిద్దిపేట జిల్లా కమిటీ రద్దు

**శెనార్తి మీడియా, బెజ్జంకి :** స్వేరోస్ నెట్వర్క్ తెలంగాణ రాష్ట్ర చీఫ్ కన్వీనర్ బలుగురి దుర్గయ్య స్వేరో,రాష్ట్ర అధ్యక్షులు చిలకబత్తిని వీరయ్య ఆదేశాల మేరకు స్వేరోస్ నెట్వర్క్ సిద్దిపేట జిల్లా కమిటీని పూర్తిగా రద్దు చేసినట్లు ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి బొర్ర సురేష్ కుమార్ తెలిపారు. నూతన జిల్లా కమిటీని త్వరలో నియమించనున్నట్లు తెలిపారు. నియామక ప్రక్రియను త్వరలో జిల్లా నాయకులకు తెలియజేస్తామని పేర్కొన్నారు.